# ఛీ! ఛీ!! ఏం మనుషులు!!!

బీనాదేవి




ఫోంచేసి వస్తుం వాళ్ళేమో. యింకా తెంపు కళ్ళూ పూర్తిగా తెయ్యనే లేదు. అంతే "రాణీ. రాణీ" అంటూ డ్రైవింగు హాల్లోంచి ఓ పొలికేక.

ఇంకెవరు? సుందరమ్మే.

లేచేలోపున మరో పొలికేక "ఎక్కడ చచ్చావ్?"

ఆహా! ఏం సున్నితం! బాబూ! అందుకే నాకు యీవిడంటే రోజురోజుకీ అసహ్యం పెరిగి పోతోంది.

"అంట్ల దగ్గరికి కాకు! "చ్చేయి" మరో గావు కేక.

తెలివంటే పీకేనే సుందరమ్మ తల్లి అంట్ల దగ్గరికి కాకులు రాక గండభేరుండాలు వస్తాయా! యీ తెలివికి కథలు కూడా రాస్తుందిట. పాపం శపించుగా!

"పక్కింటి రాజా దగ్గరికి పోయి వుంటుందమ్మా" అంటున్నాడు అరుణ్. యీయనగారు ఎమ్. బి. ఎ. చేసిన క్షణం మంచి తమ "తాతా" జనరల్ మేనేజరు నమకుంటున్నాడు. స్కూటరు లేకపోతే కాలుకింద పడదు బాబుగారికి. ఇంతకీ నా యిష్టం. రాజాతో కాకపోతే రాడీతో తిరుగుతాను. వయసులో వున్న వాళ్ళు తిరగడం తప్పా? వీడు తిరగడంలేదూ యూనివర్సిటీ ఆడపిల్లలతోని.

అప్పుడే డ్రాయింగు రూములోకి వచ్చిన బొజ్జీ "యిదిగోనమ్మా ఫేన్ కింద సోఫాలో హాయిగా నిద్రపోతోంది" అంది. బావుంది జోకు. సోఫా మీద కాకపోతే సోఫాకింద నిద్రపోతారా ఎవరైనా? యీమాత్రం బుద్ధిలేదూ యీ పిల్లకి? పైగా డాక్టరుట. మొన్న పి.జి. ఎంట్రన్సు రాసింది. ఈవిడకి సీటువస్తే నన్నడగండి.

"ఇక్కడ హాయిగా నిద్రపోతున్నావా తల్లీ" ఎక్కిరిజమ్మే.

నిజం చెప్పొద్దూ దొంగనిద్రపోతున్నాను.

"ఎంతకీ లేవడంలేదు వెధవ. నువ్వు కొట్టమ్మా కాకుల్ని" మరేం కాకుల్ని కొట్టడానికీ, ఎలుకల్ని పట్టడానికీ కాబోలు నేనీ యింట్లో వున్నాను!

నిజానికి వీళ్ళేం నన్ను కన్నారా?

హాయిగా మా అమ్మతో చర్చి వార్డెను గారింట్లో వుండేదాన్ని. ఆ వార్డెను చర్చి డబ్బు తినేసేడని అందరూ అనుకున్నా నన్నూ అమ్మనీ ప్రాణంగా చూసుకునే వాడు. మా అమ్మ ఎంత బావుంటుందనీ? మల్లెపువ్వు లేదూ, మల్లెపువ్వు అంత తెల్లగా వుంటుంది. నేను పుట్టి పది రోజులైనా కాలేదు, యిదిగో యీ సుందరమ్మ మహాతల్లి నన్ను కొనేసింది. ఎంతకో తెలుసా?

ముష్టి మూడొందలకి. మూడు వేలైనా కాదు!

అసలు మా పూర్వులది ఇంగ్లండు. మా వంశంలో బ్యూటీ కాంపిటీషన్లో ప్రైజులొచ్చిన వాళ్ళు చాలా మంది ఉన్నారు. యింతకీ నావంశం గురించి ఎంత చెప్పి ఏం లాభం? యీ సుందరమ్మ సంగతి వినండి.

ఈవిడికి మొదట యిద్దరూ కూతుళ్ళు. వాళ్ళు డాక్టర్లని ఆవిడకి తెగ గర్వం లెండి. నా మొహం డాక్టర్లు. ఏనాడూ ఎవ్వరికీ యింజెక్షను ఇవ్వటం నేను చూడ్లేదు. ఆమధ్య పార్వతి – అంటే పెద్ద కూతురు – అమలాపురమో అంచేరు పురమో వెళ్ళింది. ఎందుకని అడగరే? పని నేర్చుకుంటుందిట పని. ఈవిడ పని నేర్చుకోవడానికి మరో ఐదేళ్ళు పడుతుంది. అసలేమైనా వస్తేగా.

యింక రెండో ఆవిడ – యీవిడకి తను చాలా తెలివైన దాన్నన్న నమ్మకంతోపాటు మిగిలినవాళ్ళంతా వెధవలన్న నమ్మకం కూడా ఉంది. ఆ పెద్దపిల్లే నయం తనకేం రాదని ఒప్పేసుకుంటుంది. ఈవిడ మాత్రం ఎఫ్ తరవాత తనే అంటుంది. పొద్దున్నే ముస్తాబై రిక్షాలో ఎక్కడికో వెళ్ళిపోవడం, మంచి ఎండ మండిపోతుంటే ఏ ఒంటి గంటకో పిచ్చెక్కిన ఆల్సేషియన్లా సరసర రావడం, వాళ్ళ పాక చీఫ్‌నో, కొత్త డి.యమ్.ఎస్.నో మూడు తరాలు తిట్టడం, ఫోంచేసి ఏ 'ఉడ్ హౌస్‌'ని పట్టుకొని నిద్రపోవడం, యిదీ యీవిడ రొటీన్.

సరే ఆ "తాతా" జనరల్ మేనేజరుగాడు లేడూ–అరుణ్‌గాడు, వాడు నా ఎనెమీ నెం. 1 కొంగలా రూపూ, గెద్దలా ముక్కూ వీడూను. వాడి సీక్రెట్‌లన్నీ నాకు తెలుసు. నాకెందుకని వూరుకుంటున్నాను కాని ఎప్పుడో దెబ్బ కొట్టేస్తాను. ఓసారి.... వీడూ, వీడి క్లాస్‌మేటు—చీపురుకట్టకి చీర కట్టినట్టు రూపూ అదీని, అందుకే అంటారు జెన్స్ డిఫర్ అని—అదిగో దాన్నెక్కించుకొని స్కూటరు లాగింపేడో లేదో నేను అలా

అడుగా వరిగెత్తేను కావాలనే. అసకోర్సు దెబ్బ తగలకుండా జాగ్రత్తపడ్డాననకోండి. ఆ చీపురుకట్టగుంట బుగ్గిలో పడింది కదూ, లేచేసరికి బూజుకర్రలా ఉందనకోండి. దొరికిందే ఛాన్సు అనుకొని వీడు "సారీ, సారీ" అంటూ ఆ గుంట జెబ్బ పట్టుకొని లేవదీసేడు, ఈలోగా నేను పారిపోయేను.

వీడికీ, ఆ చిన్నికీ ఉన్నదంతా భేదమే. పోలికల్లా యిద్దరూ దొంగతనంగా సిగరెట్లు కాల్చడంలోనే. ఒక తల్లికి పుట్టేరంటే నమ్మడం కష్టమే. వీడు ఆజన్మ నిరాహార దీక్ష పూనిన కొంగలా వుంటే, టక్కుగా, బొద్దుగా మూడేళ్ళ గున్న ఏనుగులా ముద్దొస్తూ ఉంటాడు చిన్ని. వాడు జిన్నా అయితే వీడు గాంధీ. నేను అన్నం తిన్నానో లేదో, పాలు తాగేనో లేదో చూసే చిన్ని ఒక్కడే. నాకు ఒంట్లో బాగులేకపోతే డాక్టరు దగ్గరికి తీసికెళ్ళేదీ వాడే. పాప వాడి గుండె పెద్దదే. బ్రెయినే చిన్నది. నా థర్డ్ క్లాస్ పాస్ యూనివర్సిటీ ఫస్ట్ వచ్చినంత సంతోషిస్తాడు. ఎప్పటికైనా "బీ కాం" అయిందనిపించుకుంటే చాలని వాడి ఆశ.

వీడూ, నేనూ, లల్లూ ఓ పార్టీ అంటే సుందరమ్మకి అపోజిషన్. నా ఆలనా, పాలనా చిన్ని చూస్తే ఆటా, పాటా లల్లూ చూస్తాడు. నాకు కథలు కూడా చెప్తాడు. సర్ప్రైజు ఎండింగ్ యివ్వడంలో లల్లూ ముందు ఓహెన్రీ ఎందుకూ పనికి రాడనిపిస్తుంది. కృష్ణుడి నోట్లో సర్వప్రపంచాలూ చూసిన యశోద ఏమందిరా అంటే "వొర్మయ్ కృష్ణా" అంది అంటాడు మీరు నమ్మరు కాని వాడికి నాలుగేళ్ళు నిండలేదు. ఇంతకీ లల్లూ ఎవరో చెప్పలేదు కదూ. ఏమిటో యివేళ మనసంతా చికాగ్గా వుంది. అదిగో, అమలాపురమో, ఆత్రేయపురమో వెళ్ళిందన్నానే ఆవిడగారి సుపుత్రుడు.

వీళ్ళింట్లో నాకు ఎవరంటే ఎక్కువిష్టమో తెలుసా? జడ్జీగారంటే. ముక్కొల్లకోసారి మందు కొట్టినా గాంధీగారిలాంటి వాడు. పాపం. ఆ మధ్య చిన్న పిసరు హార్టు ఎటాక్‌లాంటిది వచ్చింది. రాకేం చేస్తుంది? ఈ వయసులో రిటైరై, హాయిగా కృష్ణా, రామా అనుకోకుండా యీ సోమరి పోతుల్ని పోషించడానికి, ఏమిటన్నమ్మ ఆ ఊరు, ఢిల్లీనో, దేరాఢూనో, అక్కడకి పోయి బతకలేక బడిపంతులని, కలక్టర్లకో ఎవరికో పాఠాలు చెప్తున్నాడు.

ఇంతకీ ప్రారంభించింది నా కథ. చెప్తున్నది సుందరమ్మ కథ ఆవిడంతే ఆఖరికి కథలోకూడా దయ్యంలా పట్టుకుంటుంది. చిన్నప్పుడు నన్ను ముద్దుగానే చూశేరు. ఎత్తుకొని దించేవారే కాదు. సోఫాలోంచి దిగేదాన్ని కాదు "మా రాణీ చూశేరా ఎంత ముద్దుగా వుందో" అని సుందరమ్మ మహా గొప్పగా చెప్పేది. అలాంటిది యిప్పుడు కేవలం కాకుల్ని కొట్టడానికీ, పిల్లుల్ని పట్టడానికీ పెట్టేశేరు.

అసలీ మధ్య నాకూ, సుందరమ్మకీ సరిపట్టంలేదు. ఎందుకనడక్కండి. జడ్జిగారన్నట్టు కేసు ఇన్‌కంపాటబిలిటీ అఫ్ టెంపర్మెంట్. అసలావిడకి ఎవరితో పడుతుంది? జడ్జిగారితో పడదు. "ఎన్నెస్" గారితో పడదు. "ఎన్నెస్"గారంటే ఎవరో చెప్పలేదు కదూ. వీళ్ళ ఫ్రెండు. ఆయనా డాక్టరే. కంటి డాక్టరుట. చూడ్డానికి మేకప్ అక్కర్లేని రావణాసురుడిలా వున్నా పాపం మహా మంచివాడు. నాకు ఆ మధ్య కంటి కురుపెతే రెండ్రోజుల్లో నయం చేశేడు.... తమాషా ఏమిటంటే యీ సుందరమ్మ అందర్నీ అలిసిపోయేవరకు తిట్టి ఆఖర్న తనని అందరూ బాధ పెడుతున్నారంటుంది. బావుంది కదూ! అందుకే "ఎన్నెస్"గారంటాడు "మీది పెర్సిక్యూషన్‌మేనియా" అని. దాని అర్థం నాకు తెలీదనుకోండి. కాని ఎందుకో అతను కరక్టే అనిపిస్తుంది.

నా కావిడమీద ఎంత కోపం అంటే, ఆవిడ అప్పుడప్పుడు యింటికి తాళం వేసి, నన్ను కాపలా పెట్టి షికారెళ్తుందే, అలాంటప్పుడు ఎవరైనా దొంగని పిల్చి యిల్లు అప్పగించేద్దామా అనిపిస్తుంది.

కాని .... ఏవుంది వీళ్ళింటో ఎత్తుకుపోవడానికి? మట్టి గాజులూ, కుక్క గొలుసులూ తప్ప.

నా తల్లికి చిన్నవెత్తు బంగారం లేదు కదా, యిన్నేళ్ళ జడ్జిగారి జీతం అంతా ఏంచేస్తోందో కాని....

అదిగో వస్తోంది, మేడ పునాదుల్తో సహా అదిరిపోయేటట్టు నడకా ఆవిడాను.

తల్లి వెనకే కూతురూ వచ్చింది.

"ఉట్టిదే, దొంగ నిద్ర" అంది కూతురు.

నాది నిజంగా దొంగ నిద్ర కాబట్టి సరిపోయింది కాని లేకపోతే ఆ మాటలకి ఎంత హర్ట్ అయ్యేదాన్నో.

"ఫేన్ కట్టేయి, వెధవ అదే లేస్తుంది" ఆర్డరేసింది తల్లి.

అమలు జరిపింది కూతురు.

ఫేన్ కింద పుట్టి, ఫేన్ కిందే పెరిగేను కదూ. మరింక ఫేను లేకపోతే అరక్షణం వుండలేను. చచ్చినట్టు లేచి కూర్చున్నాను. నేను లేచేక వసారాలోకి వెళ్ళిపోయారు తల్లీకూతుళ్ళు. నన్నూ రమ్మంటారేమో నన్న ఆశ, ఆశగానే మిగిలిపోయింది. నెమ్మదిగా తొంగి చూశేను. ఏవుంది? చెరో మంచంమీదా బోర్లా పడుక్కొని పుస్తకం చదువుకుంటున్నారు. మరో అయిదు నిమిషాల్లో గుర్రు పెట్టేస్తారు. నేను మాత్రం ఫేనుకూడా లేకుండా వాళ్ళ యిల్లు కాపలా కాయాలి! ఆ మధ్య ఎవరు చెప్మా? శాస్త్రిగారో, ఎవరో కాని రాశేరు ఆడవాళ్ళకి పగటి నిద్ర పనికిరాదని. వీళ్ళా ఆడవాళ్ళు?

ఏమిటో నాకూ బద్ధకంగానే ఉంది. పొద్దున్నంతా రాజీతో వాళ్ళతోటలో పరుగెత్తేనా, కాళ్ళు పీకుతున్నాయి. కాని కాపలా కాయాలి.గాంధీగారన్నట్టు "డ్యూటీముఖ్యం"

అదుగో అప్పుడొచ్చేరు 'బాసు'గారని వీళ్ళ ఫ్రెండు—ఆతనూ డాక్టరే. విచిత్రం అతను ఏలోపతీ చదివి హోమియో చేస్తాడు! వచ్చి లోపలికి వెళ్ళి మొహం కడుక్కొని, తల దువ్వుకొని, హాల్లో ఓ అయిదు నిమిషాలు కూర్చుని ఓ సిగరెట్టు కాల్చుకొని, లోపల కెళ్ళి వాళ్ళ "సర్వసేనామూర్చ"చూసి, మళ్ళీ వచ్చి మరో సిగరెట్టు కాల్చి వెళ్ళిపోయేడు. వెళ్తూ, వెళ్తూ టేబిలుమీద టేప్‌రికార్డరు పెట్టి వెళ్ళిపోయేడు. అది యీసుందరమ్మే రెండువేలకో, పన్నెండు వందలకో కొన్నది.


బాసుగారు వెళ్ళిపోయేక. చెప్పొద్దూ, నాలో విభీషణుడు లేచేడు.


ఎవరైనావచ్చియీ టేప్‌రికార్డరు ఎత్తుకుపోతే తిరపతి ఏడుకొండలూ మంచినీళ్ళు దక్కుండా నడచి ఎక్కుతానని మొక్కుదామనిపించింది.

"మొక్కనా? వద్దా" అన్న డైలమాలో వుండగానే వచ్చేడు ఒక పెద్ద డాకూలాంటి వాడు.

ఆహా! వెంకటేశ్వరా! దేవుడంటేనువ్వే నయ్యా,






ఈ దాకూని యింతకుముందు నేెప్పు డూ చూడ లేదు. బ్రిల్ క్రీము ఎడ్వర్ టైజ్ మెంటులా జుత్తూ పీడూను. దేశ భక్తుడిలా ఖద్దరు బట్టలు వేసుకున్నాడు. భుజాన ఖద్దరు సంచీ చూడగానే వీడెవడో గజదొంగ అని పించింది.

రాగానే డ్రాయింగురూములో అటు యిటు తిరిగేడు. తిరిగి టేబిలు దగ్గర ఆగేడు వీడి అమ్మకడుపు చల్లగా అత్తకడుపు చల్లగా. ఆటేప్ రికార్డరు పట్టుకు పోడేం? పోనీ నేను చూస్తున్నానన్న భయంఏమో అనుకుంటే, నేను గట్టిగా కళ్లు మూసుకున్నానే.

వాడిమొహం చూస్తే ఎందుకోగాని వీడు ఖచ్చితంగా టేప్ రికార్డర్ల దొంగేఅనిపించింది.

డాక్టర్లలోలాగే దొంగల్లోకూడా స్పెషలిష్టు లుంటారు. అమ్మయ్య నా ఆశ ఫలించింది. వాడు ఆ రికార్డరుని పట్టుకున్నాడు. తీరికే దాన్ని అటూ, ఇటూతిప్పుతాదేతప్ప ఎంతకీ పట్టుకు పోడేం?

ఓ అయిదు నిమిషాలు హిచ్ కాక్ సినీ మాలో లాంటి సస్పెన్సు. తరవాత మళ్ళీ దాన్ని టేబిలు మీదేపెట్టి సుందరమ్మ వాళ్లు పడుక్కున్న గదిలోకి వెళ్ళేడు.

హమ్మ! వీడెవడో గుండెలుతీసినబంటు!

వెళ్ళినవాడు ఊరుకున్నాడా? చిటికెలు వేశేడు వాళ్ళనిద్ర చెడ్డు చెయ్యడానికి బాంబులుపేలినా లేవని సరుక్కి చిటికెలు ఒక లెక్కా?

మళ్ళీ డ్రాయింగు రూములోకొచ్చి ఓ ఫారిన్ సిగరెట్టు వెలిగించి, ఖాళీ సిగరెట్టు పెట్టె అక్కడే పారేసి, టేప్ రికార్డరు సంచీ లో వేసుకొని వెళ్ళిపోయాడు.

ఈ దొంగవెధవ ప్రేమకధలే తప్ప డిటెక్టివు కధలు చదివినట్టులేదు. పీకపోవడానికి సిగరెట్ పెట్టె అక్కర్లేదు సిగరెట్ పీకచాలు. నాలుగ్గంటలకి అంతా లేచేరు.

టేప్ రికార్డరు పోయినట్టు వీళ్ళకి తెలియాలంటే "బాసు" గారు రావాలి, "బాసు" రావాలి, "బాసు" రావాలి భగవంతుణ్ని ప్రార్థన ప్రారంభించేను. యిందాక మొక్కుకుండానే కోరిక తీర్చిన దేవుడు యీసారి మూడు గంటలు మెడిటేషను చేయించేడు

అంతా భగవంతుడి లీల!

మొత్తానికి "బాసు" ప్రత్యక్షమయ్యే సరికి ఏడైంది. ఇందాక ఇతడు హోమియో చేస్తాడన్నానుకదూ. అది అబద్ధం కాదు కాని నిజం చెప్పాలంటే యితను స్టీలుఫేక్టరీ ఒకటి పెట్టేడు గిన్నెలతయారీకి మెడిసన్ ఎందుకు చదివేడో అర్థంకాదు యింతవరకు ఒక్క చెమ్బా కూడా తయారుచెయ్యలేదు.

వచ్చిన దగ్గర్నుంచి తను చెయ్యబోయే గిన్నెలూ, గ్లాసులూబొమ్మలుగీసి చూపిస్తాడే తప్ప రికార్డరు సంగతిచెప్పడే. ఎప్పటికైనా చెప్పడా అని అతని పక్కకుర్చీలోనేకూర్చు న్నాను.

కాఫీలు తాగుతున్నాడు

సిగరెట్లు కాలుస్తున్నాడు

రాత్రి పదైంది, అయినా రికార్డరు ఊసు లేదే! ఇంక ఈవేళ ఈ దొంగతనం సంగతి తెలిదు కాబోలని, నిద్ర పోదామనుకు న్నంతలో అపద్బాంధవుడిలా వొచ్చేడు ఇందాకటి ఖద్దరు దొంగ

ఓరి! నువ్వు మామూలు దొంగవికావురా అసల్సిసలు చార్ సౌబీస్.

వాడ్ని వీళ్లెవరికీ తెలీనట్టుంది. వాడే యింట్రడ్యూస్ చేసుకున్నాడు. ఏదో పేరు చెప్పేడుకాని మరిచిపోయాను. వాడిదిహైద రాబాదట. కధలు రాస్తాట్ట. టేప్ రికార్డర్లు కూడా కొట్టేస్తాడని అరవబోయి మానేశేను. మా సుందరమ్మకధలంటే వెర్రిట. అప్పుడు ఆవిడ మొహం చూడండి 70. ఎం.ఎం.లో తప్పఫోటోతియ్యలేం. అంతపొంగిపోయింది!

అన్నట్టు యీ కవి గాడికి సంగీతం అంటే పిచ్చిట. (దొంగతనం హాబీనా?)

దొంగకి కాఫీ యిచ్చేరు. మళ్ళీ అందరూ తాగేరు,

అదేదో సినిమాలో చెప్పినట్టు "ఎవరైనా వస్తే కాఫీ, రాకపోతే కాఫీ, పనుంటేకాఫీ. పన్లేకపోతే కాఫీ" జడ్జిగారి జీతం అంతా ఎలా అయిపోతోందో యిప్పుడర్థమైంది.

"మధ్యాన్నం మూడింటికి వచ్చేను, యివేళ యీ ఊర్లో బాలమురళీకృష్ణ కచేరీ వుందిట. నిజంగా ప్రాణం ఉసూరు మంది టేప్ రికార్డరు తెచ్చుకోలేదేనని. యీలోగా మిమ్మల్ని పలకరించు దామని మీయింటికి వచ్చేను. తీరా యింత దూరంవస్తే మీరంతా నిద్రపోతున్నారు టేబిలు మీద బ్రహ్మాండ మైన టేప్ రికార్డరుంది చెప్పకుండా తీసు కెళ్తే ఏమనుకుంటారో?...."

శెబాష్. వీడండి చార్ సౌబీస్ అమ్మ మొగుడు తను ఇల్లు వదిలే సరికి రికార్డరు టేబిలు మీదే వుందంటాడేమిటి? కొంప దీసి దొంగతనం నామీదకి రాదుకదా? కుర్చీ చివరికి జరిగి శ్రద్ధగా వింటున్నాను.

"బాలమురళీకృష్ణే జయించేడు. తరు వాత క్షమాపణలు చెప్పుకోవచ్చని రికార్డరు తీసి కెళ్లేను. యిదిగో. క్షమించండి అడగ కుండా తీసి కెళ్ళినందుకు........"

ఇంక అక్కడ ఒక్కక్షణంకూడా వుండా లనిపించక గదిలోకి వెళ్ళిపోయాను.

ఛీఛీ!! ఏం మనుషులు?

జ్యోతి